# సాహితీ మార్గదర్శి మునిపల్లె

## ఘనంగా శత జయంతి వేడుక

**పెనుగొండ, న్యూస్‌టుడే:** కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మునిపల్లె రాజు తెలుగు సాహిత్యంలో భవిష్యత్తు తరాలకు మార్గదర్శిగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. మునిపల్లె రాజు శత జయంతి సందర్భంగా పెనుగొండ ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల, కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూదిల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో ఆయన సాహిత్యంపై శనివారం జాతీయ స్థాయి సదస్సు జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకులు ఆచార్య సి. మృణాళిని మాట్లాడుతూ మునిపల్లె రాజు కథలు చదివితే జీవితంలో వెలుగు రేఖలు కనిపిస్తాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి, రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ మునిపల్లె రాజును ఒక శతాబ్దపు తెలుగు సాహిత్య ప్రతినిధిగా చూడాలన్నారు. అనంతరం చిన వీరభద్రుడు రచించిన కథల సముద్రం, ఎంఆర్వీ సత్యనారాయణ మూర్తి రచించిన తెలుగు కథారత్నాలు పుస్తకాలను మృణాళిని, అతిథులు, నిర్వాహకులు ఆవిష్కరించారు. మునిపల్లె రాజు కుమార్తె ఉష, సదస్సు డైరెక్టర్ రంకిరెడ్డి రామ్మోహన రావు, కన్వీనర్ కేవీఎన్డీ వరప్రసాద్, విద్యాసంస్థల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపల్ వైవీవీ అప్పారావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



తెలుగు కథారత్నాలు పుస్తకం ఆవిష్కరించిన మృణాళిని తదితరులు